క్లుప్తంగా

జవహర్ వాకర్స్ క్లబ్‌కు బెస్ట్ అవార్డు


సత్యనారాయణను సత్కరిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు

సీటీఆర్ఐ: జవహర్ వాకర్స్ క్లబ్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. తునిలో సోమవారం వాకర్స్ ఇంటర్నేషనల్ తూర్పుగోదావరి జిల్లా స్థాయి వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ వాకర్స్ క్లబ్ ఈ ఏడాది నిర్వహించిన సేవా కార్యక్రమాలకు జిల్లా స్థాయి ప్రథమ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడితో పాటు సభ్యులను ఘనంగా సత్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులకు అధునాతన షెల్టర్ ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ సభ్యుల సహకారంతోనే ఇవన్నీ సాధ్యమైనట్టు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌లో శ్రీరంగపట్నానికి ద్వితీయ స్థానం

మధురపూడి: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)లలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నం హైస్కూల్ ద్వితీయ స్థానం దక్కించుకున్నట్టు ప్రధానోపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది తొమ్మిదో తరగతి విద్యార్థినులు మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారన్నారు. జిల్లాలో అనపర్తి బాలికల పాఠశాల ప్రథమ స్థానం, శ్రీరంగపట్నానికి ద్వితీయస్థానం వచ్చిందన్నారు.

ఘనంగా ఆజాద్ జయంత్యుత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంత్యుత్సవాన్ని సోమవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరేరామకృష్ణ మాట్లాడుతూ ఆజాద్ మహోన్నత వ్యక్తిత్వాన్ని ప్రశంసించారు. తెలుగు అధ్యాపకురాలు, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ సుధామయి మాట్లాడుతూ అనేక భాషల్లో పండితుడైన మౌలానా తన విజ్ఞానాన్ని, మేధస్సును దేశం కోసం వినియోగించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

మధురపూడి: మండలంలోని గాదరాడలో సోమవారం ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. గ్రామంలోని కనకదుర్గమ్మ గుడి వద్ద ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ నుంచి పెద్దాపురం మండలం కాండ్రకోటకు ఇసుక ట్రాక్టర్ వెళుతోంది. అతివేగం కారణంగా గాదరాడలోని దుర్గమ్మ గుడి వద్ద ఆగి ఉన్న ఆటోను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆటోలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా.. ఇసుక ట్రాక్టర్లు అత్యంతగా వేగంగా వెళుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బోధనపై ఆసక్తి చూపితే మంచి ఫలితాలు


మాట్లాడుతున్న జీవీఎస్ ప్రసాద్

రాజానగరం: ఉపాధ్యాయుడు పాఠాలను ఆసక్తిగా బోధిస్తే విద్యార్థులకు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంటాయని ప్రముఖ మోటివేటర్, సింగరేణి కొల్లరీస్ విశ్రాంత డీజీఎం జీవీఎస్ ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ బొమ్మూరు సెంటీనియల్ అధ్యక్షులు కొప్పిశెట్టి రమేష్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని పుణ్యక్షేత్రం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు లిజనింగ్ స్కిల్స్ (వినే నైపుణ్యాలు)పై సోమవారం మోటివేషన్ క్లాస్ (ప్రేరణ తరగతి) నిర్వహించారు. మనిషి ఇక్కడ, మనస్సు ఎక్కడో అన్నట్టుగా తరగతి గదిలో కూర్చుంటే ఉపాధ్యాయుడు చేసే బోధన గాలిలో కలిసిపోతుందన్నారు. ఆ బోధన విద్యార్థి బుర్రకు చేరితేనే ఉభయులకు ఫలితం ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. చదవడం, రాయడం, చెప్పడం, వినడంలోనే అంతర్జాతీయ ప్రమాణాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులందరికీ పెన్నులు అందజేశారు.


కడియపులంకలో అనంతేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు


పుష్కరఘాట్‌లో పూజలు చేస్తున్న భక్తులు


దీపాలు వెలిగిస్తున్న మహిళలు


దీపాలకు నమస్కరిస్తున్న మహిళలు

కార్తికం.. దేదీప్యం

- ఘనంగా కార్తిక సోమవారం పూజలు
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- కిక్కిరిసిన పుష్కరఘాట్


కడియపులంకలో చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన దీపాలు

కడియం: కార్తిక మాసంలో రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. మహాదేవుని నామస్మరణతో ఆలయాల వద్ద ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులు తెల్లవారు జామునే పుణ్యస్నానాలు ఆచరించి, కార్తిక దీపాలను వెలిగించారు. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, దుళ్లలోని అగస్త్యేశ్వరాలయం, జేగురుపాడులోని నగరేశ్వరాలయం, వీరవరం, మురమండ గ్రామాల్లోని సోమేశ్వరాలయాలు, మాధవరాయుడుపాలెం, వేమగిరి గ్రామాల్లోని శివాలయాలు, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేశారు.

లక్ష దీపోత్సవం

కడియపులంకలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో మహిళలు హాజరై దీపాలను వెలిగించారు. ఆంజనేయస్వామివారి జన్మ నక్షత్ర పూజ, పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణం అనంతరం దీపోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలోని చెరువు చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై మహిళలు దీపాలను వెలిగించారు. వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన దీపాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతాలాపనల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పుష్కరఘాట్‌లో..

రాజమహేంద్రవరం సిటీ: కార్తిక సోమవారం సందర్భంగా పుష్కరఘాట్ భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజామునుంచే పెద్దసంఖ్యలో తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు నదిలో దీపాలను వదిలారు. రావిచెట్టు వద్ద పూజలు నిర్వహించారు.


దీపోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు


కడియపులంకలో కార్తిక దీపాన్ని వెలిగిస్తున్న భక్తులు

లాలాచెరువు పాఠశాల సందర్శన

ప్రకాశం నగర్: ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎస్ఆర్‌పీ) 99వ ఫౌండేషన్ కోర్సులో భాగంగా 11 మంది ట్రైనీ ఐఏఎస్‌లు సోమవారం లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అక్కడ నిర్మించిన లైబ్రరీ భవనం, దానిలోని డిజిటల్ పుస్తకాలు, లైబ్రరీని విద్యార్థులు వినియోగించుకుంటున్న విధానాన్ని తెలుసుకున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు వినియోగిస్తున్న ఫ్లాట్ ప్యానెల్ బోర్డు పనితీరును పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో అందిస్తున్న మెనూ గురించి అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కందికొండ రమేష్, నగరపాలక సంస్థ డీఈ పి.ప్రసాద్, లైజనింగ్ అధికారి రవి కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి పాల్గొన్నారు.

ఉసిరి చెట్టుకు పూజలు

కడియం: మండలంలోని బుర్రిలంకలో టీవీసీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి ఆధ్వర్యంలో సోమవారం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి పలువురు ప్రముఖులు, నర్సరీ రైతులు తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఎడ్యుకేషన్ డే

ప్రకాశం నగర్: ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను వివరించారు. అనంతరం స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత బి.నాగేశ్వరిని సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు బి.భవాని, ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

- చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి ?
- మాజీ ఎంపీ హర్షకుమార్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. రాజమహేంద్రవరంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీపై కక్షసాధింపే తప్ప.. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్నదేమీ లేదన్నారు. కూటమి ప్రజలకు చాలా హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు కావస్తున్నా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. పవన్ కల్యాణ్ రోడ్లు బాగోలేవని చెప్పారని, అయితే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లు వేయడం మర్చిపోయారన్నారు. రాజమహేంద్రవరం – కాకినాడ రోడ్డు దారుణంగా ఉందని.. దీనిని బాగు చేయాలనే ధ్యాస ఎంపీ, ఎమ్మెల్యేలకు లేదా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఏమైందని, ఒక్క నోటిఫికేషన్ అయినా ప్రభుత్వం జారీ చేసిందా అని నిలదీశారు. కనీసం బ్యాక్‌లాగ్ పోస్టులైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఏమాత్రం తగ్గడం లేదన్నారు. చాలా చోట్ల హత్యలు జరుగుతున్నా పట్టించుకోని దుస్థితిలో పోలీసులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పేరుతో ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని విమర్శించారు. పోలవరం డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు బహిర్గతం చేయాలని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఉచిత బస్సు పథకాలు అమలు చేయాలన్నారు.

జగన్ ప్రతిపక్ష నాయకుడే

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా లేకపోయినా ఆయన ప్రతిపక్ష నాయకుడేనని హర్షకుమార్ పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటివరకూ చెల్లించలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు లడ్డూ ప్రసాదం, సనాతన ధర్మం అంశాలను పవన్, చంద్రబాబు ముందుకు తీసుకువచ్చారన్నారు. టీడీపీ దృష్టిలో అగ్రవర్ణాలకు తప్పితే బలహీన వర్గాలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో చోటు లేదని చెప్పారు. కమ్మ సామాజిక వర్గానికి ఒకటి, కాపులకు ఒకటి చొప్పున చంద్రబాబు సీట్లు కేటాయించారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సీట్లు ఇద్దామనే ఉద్దేశం పవన్‌కు, చంద్రబాబుకు లేదన్నారు. తన తనయుడు జీవీ సుందర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నాడని, మంచి ఎమ్మెల్సీని అందిస్తున్నానని, ఎన్నుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనలానే పోరాడే సుందర్‌ను గెలిపించాలని, ప్రజా సమస్యలపై పోరాడకపోతే తానే ముందుండి ప్రశ్నిస్తానని హర్షకుమార్ అన్నారు.

ప్రేక్షకులను అలరించేలా మట్కా సినిమా

- సినీ నటుడు వరుణ్ తేజ్
- రాజమహేంద్రవరంలో సందడి


గీతా అప్సర థియేటర్‌లో సినీ నటుడు వరుణ్ తేజ్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రేక్షకులను, మెగా అభిమానులను మట్కా సినిమా అలరిస్తుందని సినీనటుడు వరుణ్ తేజ్ అన్నారు. మట్కా చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం ఆయన రాజమహేంద్రవరంలో సందడి చేశారు. ముందుగా మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు మెగా అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డు రామాలయం సెంటర్ నుంచి అప్సర థియేటర్ వరకూ ర్యాలీగా తీసుకువచ్చారు. థియేటర్ వద్ద క్రేన్ సహాయంతో భారీ గజమాలను వరుణ్ తేజ్‌కు వేశారు. అక్కడే మట్కా సినిమా భారీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వరుణ్ తేజ్ థియేటర్‌లోకి వచ్చి ప్రేక్షకులతో కలిసి ట్రైలర్‌ను తిలకించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న మట్కా చిత్రంతో థియేటర్‌లలో కలుద్దామన్నారు. నటుడు సత్యం రాజేష్ మాట్లాడుతూ మట్కా చిత్రం అద్భుతంగా ఉంటుందన్నారు. వరుణ్ తేజ్‌కు చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షులు ఏడిద బాబీ, మైత్రి మూవీ మేకర్స్ ప్రతినిధులు, అప్సర థియేటర్ యాజమాన్యం స్వాగతం పలికారు.

ఆర్టీసీ అధికారుల ఫోన్ నంబర్లు

జిల్లా ప్రజారవాణా అధికారి	షర్మిల అశోక	91542 91407
రాజమహేంద్రవరం డీఎం	షేక్ షబ్నం	99592 25535
డిపో అసిస్టెంట్ మేనేజర్	అజయ్‌బాబు	73829 12141
డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (గ్యారేజ్)	ఎస్.నాగలక్ష్మి	79890 45549
సీనియర్ మెడికల్ ఆఫీసర్	ప్రసూనాంబ	97014 50208
డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ జోన్–2	రవిశంకర్	99592 25789
డీపీటీవో అకౌంట్స్ ఆఫీసర్	ఆర్‌వీ కోటేశ్వరరావు	99592 25529
అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కార్గో)	కె.మాధవ్	73311 47262
డీపీటీఓ పీఆర్ఓ	బి.శివకుమార్	73829 09283
చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్	బి.మోహన్ కుమార్	73829 10603
రిజర్వేషన్ కార్యాలయం ఇన్‌చార్జ్	మహ్మద్ రియాజ్	99592 25561
డీపీటీఓ రీజినల్ కోర్ గ్రూప్ మెంబర్	జి.కృష్ణ	73829 09296
మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్	జీఎల్ఎన్ మూర్తి	73829 11418
డీపీటీఓ ఆఫీస్ సూపరింటెండెంట్	టి.మల్లేశ్వరరావు	73829 09279
రాజమహేంద్రవరం బస్టాండ్ మేనేజర్	డి.త్రిమూర్తులు	73829 10187
హెవీ డ్రైవింగ్ స్కూల్ ట్రైనర్	వీఎస్ఎల్ రావు	99483 13344

నన్నయలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ (మెన్ అండ్ ఉమెన్) పోటీలు సోమవారం జరిగాయి. పురుషుల విభాగంలో పీఆర్ డిగ్రీ కళాశాల (కాకినాడ), మహిళల విభాగంలో అన్నవరం సత్యదేవి మహిళ డిగ్రీ కళాశాల (కాకినాడ) ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించాయి. అనంతరం గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే క్రీడాకారుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ప్రకటించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, జాతీయ వెయిట్ లిఫ్టింగ్ సంఘం ఉపాధ్యక్షులు బాడేటి వెంకటరామయ్య, భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

పైపులైన్లు బయటకు మార్చాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని మురుగు కాలువల్లో ఉన్న నీటి సరఫరా పైపులైన్లను వెంటనే బయటకు మార్చాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. 14వ డివిజన్‌లోని స్టేడియం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, శ్యామలా థియేటర్ నుంచి ఆల్కాట్‌తోట వరకూ సోమవారం ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల వార్డు పర్యటనలో దాదాపు 60 ప్రదేశాల్లో నీటి సరఫరా పైపులైన్లు కాలువల్లో ఉన్నట్టు గుర్తించి బయటకు తీయించామన్నారు. మిగిలిన వాటిని కూడా తీసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ రోడ్డును పరిశీలించారు. అక్కడ పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఆదేశించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ట్రాఫిక్‌కు అడ్డంకిగా ఉన్న తోపుడు బండ్లు, ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిపారు. కాగా.. ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా నగరానికి వచ్చిన ట్రైనీ కలెక్టర్లు..రెల్లిపేటలోని ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. గోరక్షణపేటలో కార్పొరేషన్‌కు చెందిన రిజర్వాయర్లను సందర్శించారు. అదే పేటలో మహిళా సంఘాలతో మాట్లాడారు.

పోసానిని అరెస్ట్ చేయాలని ఎస్పీకి విన్నపం

రాజమహేంద్రవరం రూరల్: హాస్య నటుడు పోసాని కృష్ణమురళీని వెంటనే అరెస్టు చేయాలని జనసేన పార్టీ రాజమహేంద్రవరం అధ్యక్షుడు వై.శ్రీనివాస్ సోమవారం ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను కోరారు. ఆయన, లీగల్ సెల్ వైస్ చైర్మన్ రామచంద్ర, ఆ పార్టీ నేతలు ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిశారు. గత ప్రభుత్వ హయాంలో పోసానిని అరెస్టు చేయాలని ఫిర్యాదు చేస్తే అప్పుడు పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా పోసానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అయ్యబాభౌయ్..

- కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- కానరాని నియంత్రణ చర్యలు


వీధిలో గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

కడియం: వీధి కుక్కల నియంత్రణ చర్యలపై చట్టప్రకారం స్పష్టమైన కార్యాచరణ ఉంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం దాన్ని అమలు చేస్తున్న దాఖలాలు లేవు. జీవావరణ వ్యవస్థలో వీధి కుక్కలకు కూడా ప్రత్యేక బాధ్యత ఉందని సంబంధిత నిపుణులు చెబుతుంటారు. అయితే పరిమితికి మించి వాటి సంతతి పెరిగితే నియంత్రణ చర్యలు చేపట్టాలని కూడా నిబంధనలు చెబుతున్నాయి. కానీ గ్రామస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

నియోజకవర్గంలో..

రూరల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ సుమారు 200 నుంచి 300 వరకు కుక్కలు ఉంటాయని అంచనా. వీటి సంతతిని నియంత్రించేందుకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. అయితే అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీటిని చంపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అయితే మూగజీవాల రక్షణకు ఏర్పాటైన పలు సంస్థలు న్యాయ పరంగా అడ్డుకోవడాన్ని సాకుగా చూపి, అసలు నియంత్రణ చర్యలే చేపట్టడం లేదని ప్రజలు చెబుతున్నారు.

స్వైరవిహారం

గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగించే ప్రయాణికుల వెంబడి పడుతున్నాయి. వాటి దాడిలో పలువురు గాయపడుతున్నారు. అలాగే కుక్కలు వెంటపడడంతో ద్విచక్ర వాహనాల నుంచి కిందపడి గాయాలపాలవుతున్నారు. కడియం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో ప్రతి రోజూ కనీసం ఐదుగురికైనా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారంటే వీధి కుక్కల స్వైర విహారం ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం వీధి కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొత్త తెగుళ్లు


ఆహార వ్యర్థాలను తిని వీధి కుక్కలు మనుగడ సాగించేవి. అయితే ఓపెన్ డెఫికేషన్‌కు అడ్డుకట్ట వేయడంతో ఇవి ప్రధానంగా చికెన్, మటన్, చేపల వ్యర్థాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇది వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్త తెగుళ్లు ఆశించడంతో పాటు సాధారణ ప్రవర్తనకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ఆహారం కోసం వీటి మధ్య జరుగుతున్న పోటీ కారణంగా సదరు వ్యర్థాలను పాడేసే ప్రాంతాల్లో కుక్కల యుద్ధాలే జరుగుతున్నాయి.

పెరిగిన కుక్కల సంతతి

వీధి కుక్కల సంతతి ఎక్కడికక్కడే పెరిగిపోయింది. వాటి నియంత్రణకు చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా మాంసాహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. అక్కడ పదుల సంఖ్యలో కుక్కలు గుమిగూడుతున్నాయి. సమీపంలో వెళ్లే వారిపై దాడికి ప్రయత్నిస్తున్నాయి. దీంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఎంఎస్ఎల్ మూర్తి, కడియపులంక

సినిమాలు



శ్యామల : బ్లడీ బెగ్గర్
సూర్యమినీ : రహస్యం ఇదం జగత్
సూర్యప్యాలెస్ : ధూమ్‌ధామ్
శివజ్యోతి : క
అనుశ్రీ : క
స్వామి : అమరన్
అశోక : లక్కీభాస్కర్
రాజా : అమరన్
రంభ : బఘీర, భూల్‌భులయ్యా–3
ఊర్వశి : అమరన్
మేనక : జితేందర్‌రెడ్డి
కుమారి : దేవర
అప్సర : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో

నామవరం
వీఎస్ మహల్ : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో, క

ధవళేశ్వరం
మురళీకృష్ణ : అమరన్

కడియం
వెంకటసూర్య : క